తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice
వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

24-04-2026
శుక్రవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 84

PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–


## పీసీ ఘోష్ కమిటీ నివేదిక కాళేశ్వరంలో కలిసింది



- కెసిఆర్, హరీష్ రావు కడిగిన ముత్యంలా వచ్చారు
- ఘోష్ కమిషన్ నివేదిక పై హై కోర్ట్ తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు
- మాజీ మంత్రి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**నర్సాపూర్ ఏప్రిల్ 23 (సిరి న్యూస్)**

కాళేశ్వరం ప్రాజెక్ట్ పై అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన పీ సి ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మా రెడ్డి అన్నారు.

మిగతా 6వ పేజీలో..




# ప్రయివేట్ భయమే సమ్మెకు కారణమా?

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల అభద్రతకు కారణమేంటి?
పెరుగుతున్న ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు
జిల్లాలకు బదిలీలు తప్పవన్న సంకేతాలు
బకాయిలో ఉన్న పీఆర్సీలు గుర్తింపు ఎన్నికలు
లేక బలహీనమైన కార్మిక సంఘాలు
పాత బస్సులతో పెరిగిన పనిభారం

## సర్కారుపై నమ్మకం సన్నగిల్లిందా?

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**
తెలంగాణ ఆర్టీసీలో నెలకొన్న సమ్మె పరిస్థితులు కార్మికుల్లో పెరుగుతున్న ఆందోళనను ప్రతిబింబిస్తున్నాయి. ప్రజల రోజువారీ ప్రయాణానికి కీలకమైన ఈ సంస్థలో సమస్యలు పేరుకుపోవడం, వాటి పరిష్కారంలో ఆలస్యం జరగడం కార్మికులను సమ్మె దిశగా నెట్టింది. రోజుకు వేల సంఖ్యలో బస్సులు నడిపిస్తూ లక్షలాది మందికి సేవలందిస్తున్న ఆర్టీసీ సంస్థలో ఉద్యోగుల భద్రత, భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. గతంలో

మిగతా 2వ పేజీలో..



హామీలు నెరవేర్చాలంటూ ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం



2

## ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం కీలక నిర్ణయం

- చర్చలకు కార్మికులకు ఆహ్వానం
- మంత్రివర్గంలో పలు కీలక అంశాలపై సమీక్ష
- సమ్మె విరమించి చర్చలకు రావాలని కార్మికులకు ప్రభుత్వం విజ్ఞప్తి
- ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో శుక్రవారం చర్చలకు నిర్ణయం
- కాళేశ్వరం కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పు సమీక్ష
- ఉద్యోగుల బకాయిలపై ప్రత్యేక ఉపసంఘం ఏర్పాటు నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**
రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం కీలకంగా స్పందించింది. సమ్మెను విరమించి చర్చలకు రావాలని మంత్రివర్గం

మిగతా 2వ పేజీలో..





2

## దశలవారీగా అంగన్‌వాడీల అప్‌గ్రేడ్

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## తిరగని ప్రగతి రథ చక్రాలు

రెండో రోజుకు ఆర్టీసీ కార్మికుల సమ్మె
బలవంతంగా బస్సులు నడిపేందుకు పోలీసుల యత్నాలు
పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
అవస్థలు పడుతున్న ప్రజలు

2







## ఎల్బీనగర్ నుండి హయత్‌నగర్ వరకు కారిడార్

- డబుల్ డెక్కర్ కారిడార్‌తో ట్రాఫిక్‌కు చెక్
- ప్రాజెక్ట్‌పై అధికారులతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్23 సిరి న్యూస్:**
ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించ తలపెట్టిన 7.1 కి. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి

మిగతా 3వ పేజీలో..



2

## నాదెండ్ల మృతి ఉమ్మడి ఏపీ ప్రజలకు తీరని లోటు




## గ్లోబల్ ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ సెంటర్‌గా తెలంగాణ

- ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరిశ్రమలకు ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కులు
- 'బేకర్ హ్యూస్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్ సిరి న్యూస్,**
తెలంగాణను కేవలం తయారీ కేంద్రంగా మాత్రమే కాక గ్లోబల్ ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ సెంటర్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పునరుద్ఘాటించారు.

మిగతా 2వ పేజీలో..

## విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు
- ప్రతీ విద్యార్థి ఉన్నతస్థాయికి చేరేలా సకల సదుపాయాలు
- రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి



**మణుగూరు, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. పేదవారి పిల్లలు కూడా ధనికుల పిల్లలతో సమానంగా చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. విద్య పట్ల ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు అనేక నిదర్శనాలు ఉన్నాయన్నారు. మణుగూరు మండలం లంక మల్లారం గ్రామంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని బీటీ రహదారి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి టీటీఆర్‌జేసీ

మిగతా 3వ పేజీలో..



2

## కాళేశ్వరంపై న్యాయ నిపుణులతో చర్చ

- తదుపరి కార్యాచరణపై సబ్ కమిటీలో నిర్ణయం
- మంత్రి ఉత్తమ్ వెల్లడి



2

## వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు

అందజేసిన డీజీపీ శివధర్ రెడ్డి

## ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు కారిడార్

**మొదటిపేజీ తరువాయి**

రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా.బి.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సక్ష సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా సుమారు 4గంటల పాటు జరిగిన ఈ సక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఈ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సంకల్పించిందని మంత్రి అన్నారు. సుమారు 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని,హైదరాబాద్ - విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు. ఎన్‌హెచ్ 65 రూట్ లో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి,రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే సప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాటవచ్చు అని,ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు. దీనికి వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ పక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని కృష్ణ ప్రసాద్ తెలిపారు. కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి,పైన మెట్రో రైలు నిర్మాణం నేపథ్యంలో సాంకేతికంగా పిల్లర్ ఫౌండేషన్,స్ట్రక్చర్, మెట్రో స్టేషన్స్ వంటి అంశాలపై చర్చించారు. పూర్తి నాణ్యతతో బలమైన పిల్లర్లు, రెగ్యులర్ ఎలివేటెడ్ కారిడార్ కంటే పటిష్టంగా,వెడల్పుగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్లు నిర్మించాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ నేపథ్యంలో ఒకే వర్క్ ఏజెన్సీ నిర్మాణ పనులు చేపడితే సమన్వయలోపం లాంటి ఇబ్బంది లేకుండా.. త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా ఉంటుందనే అభిప్రాయం మంత్రి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు మానిటరింగ్ చేయడానికి వీలుగా ఉంటుందనీ,పనులు కూడా సమాంతరంగా జరుగుతాయని మంత్రితో అధికారులు తమ అభిప్రాయాలను చెప్పారు. మంత్రి సూచన మేరకు అందుకు అనుగుణంగా చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్ ప్రాజెక్ట్ కన్సెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. కన్సల్టెన్సీని పిలిచి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్ తయారు చేయాలని నిర్ణయించారు. అధికారులు తమ స్థాయిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేస్తే.. వచ్చే వారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పనులు వెంటనే ప్రారంభించేలా విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.

## వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు

- **అందజేసిన డీజీపీ శివధర్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పోలీసు అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి గురువారం నగదు బహుమతులను అందజేశారు. రెండు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు సెంట్రల్ ఫ్లాగ్ ఫండ్ నుంచి నగదు పురస్కారాలను అందజేశారు. ప్రథమ విజేతలకు రూ.20,000, ద్వితీయ విజేతలకు రూ.15,000, తృతీయ విజేతలకు రూ.10,000 చొప్పున బహుమతులు ఖరారు చేశారు. విజేతల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

**కేటగిరీ-1 (పీసీ నుంచి ఏఎస్ఐ వరకు)**

పని ప్రదేశాల్లో లింగ వివక్ష అనే అంశంపై నిర్వహించిన ఈ విభాగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా 17వ బెటాలియన్‌కు చెందిన ధసరి ప్రశాంత్, కావేరి దీపిక ప్రథమ బహుమతి సాధించారు. కరీంనగర్ పీటీసీకి చెందిన కె.రవికుమార్, ఇబ్రహీంపట్నం 3వ బెటాలియన్‌కు చెందిన ఎ.రాజు ద్వితీయ, కరీంనగర్ జిల్లా చొప్పదండి పీఎస్‌కు చెందిన పి.స్వర్ణలత, జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన ఎ.శ్రీలత తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

**కేటగిరీ-2 (ఎస్ఐ ఆపై స్థాయి అధికారులు)**

అట్టడుగు స్థాయి పోలీసింగ్‌ను బలోపేతం చేయడం అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ములుగు జిల్లా ఆరఐ వెంకట నారాయణ, హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డబ్ల్యూపీఎస్ ఎసఐ వై.మౌనిక ప్రథమ స్థానంలో నిలిచారు. వరంగల్ పీటీసీ ఇన్‌స్పెక్టర్ కె.అశోక్ కుమార్, ఇబ్రహీంపట్నం 3వ బెటాలియన్ ఆరఎసఐ ఎన్.వి.ఆర్.చౌదరి ద్వితీయ, సీఐడీ ఎస్ఐ ఖాజా హాఫీజున్నీసా బేగం, జోగులాంబ గద్వాల భరోసా కేంద్రం ఎస్ఐ బి.తారక తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఐజీపీ గజరావు భూపాల్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**డీజీపీని కలిసిన పదోన్నతి పొందిన ఐపీఎస్‌లు**

డీజీపీలుగా పదోన్నతి పొందిన 1995, 1996 బ్యాచ్‌లకు చెంది ఐపీఎస్ అధికారులు గురువారం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. 1995 బ్యాచ్‌కు చెందిన వీరిశెట్టి వెంకట శ్రీనివాసరావు, స్వాతి లక్రా, మహేష్ మురళీధర్ భగవత్‌లతోపాటు 1996 బ్యాచ్‌కు చెందిన చారు సిన్హా, డాక్టర్ అనిల్ కుమార్‌లు డీజీపీని కలిసిన వారిలో ఉన్నారు.

## నాదెండ్ల మృతి ఉమ్మడి ఏపీ ప్రజలకు తీరని లోటు

**హైదరాబాద్, ఏప్రిల్ 23 :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు నాదెండ్ల భాస్కర రావు మృతి పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి భాస్కరరావు భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుమారుడు, జనసేన పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ భాస్కరరావు స్వర్గస్తులు కావడం బీజేపీ శ్రేణులకు, ఉమ్మడి ఏపీ ప్రజలకు తీరని లోటు అని అంటూ రెండు రాష్ట్రాలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమైనవి కొనియాడారు. పార్టీలో అత్యంత క్రియాశీలకంగా ఉంటూ తన అనుభవంతో దిశానిర్దేశం చేసేవారన్నారు. తాను రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన రోజున వారు స్వయంగా వచ్చి ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. వారి కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీలో కీలక నేతగా ఉన్నారని, ఈ కష్టసమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. భాస్కరరావు ఆత్మకు శాంతి చేకూరాలని రామచందర్ రావు ప్రార్థించారు. కార్యక్రమంలో బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్, తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరంపై న్యాయ నిపుణులతో చర్చ

**హైదరాబాద్, ఏప్రిల్23 సిరి న్యూస్:**

కాళేశ్వరం అంశంపై ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని మంత్రి ఉత్తమ్కుమార్‌రెడ్డి తెలిపారు. మంత్రుల సబ్కమిటీ వేసుకుని.. చర్చించుకుని ఎలా ముందుకెళ్లాలో నిర్ణయిస్తామని చెప్పారు. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం వ్యవహారం పై సీబీఐకి లేఖ రాసి నెలలు గడిచినా ఎందుకు ముందుకెళ్లట్లేదో మీరే అర్థం చేసుకోవచ్చన్నారు. తాను, సీఎం రేవంత్ త్వరలో సీబీఐ డైరెక్టర్ను కలవబోతున్నట్లు వెల్లడించారు. 'కాళేశ్వరం అవకతవకలపై వేసిన కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధమని కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్ వేశారు. అయితే, కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. కేసీఆర్, హరీశ్రావుల ప్రధాన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. కమిషన్ ను చట్టవిరుద్ధం కాదని.. నివేదిక కొనసాగుతుందని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. సాంకేతిక అంశాల కారణంగానే కేసీఆర్, హరీశ్రావులపై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. వారిద్దరూ నిర్దోషులని, కాళేశ్వరం అవకతవకలకు బాధ్యులు కారని ఉన్నత న్యాయస్థానం ఎక్కడా చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదు. అభిషేక్‌సింఘ్వీని కలిసి తదుపరి కార్యాచరణ చేపడతామని మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి అన్నారు.

# ప్రైవేట్ భయమే సమ్మెకు కారణమా?

**మొదటిపేజీ తరువాయి**

ఇచ్చిన హామీల అమలు ఆలస్యం కావడం వల్ల ప్రభుత్వంపై నమ్మకం దెబ్బతింటోందని కార్మిక వర్గాలు భావిస్తున్నాయి.

**ఎలక్ట్రిక్, అద్దె బస్సుల ప్రభావం**

పట్టణాల్లో కాలుష్యాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని ప్రభుత్వం పెంచుతోంది. అయితే ఈ మార్పుల నేపథ్యంలో సిబ్బందిని జిల్లాలకు బదిలీ చేయడం, అద్దె బస్సులను ప్రవేశపెట్టడం కార్మికుల్లో సందేహాలకు దారి తీసింది. ఈ చర్యలు సంస్థను క్రమంగా ప్రైవేట్ వైపు మళ్లిస్తున్నాయన్న భావన బలపడుతోంది.

**బదిలీలు, విధానాలపై సందేహాలు**

ప్రైవేట్ ఆలోచన లేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, నగరాల్లో ఉన్న సిబ్బందిని జిల్లాలకు మార్చడం, ప్రైవేట్ బస్సులకు అవకాశాలు కల్పించడం ఎందుకన్న ప్రశ్నలు కార్మికుల్లో వ్యక్తమవుతున్నాయి.

**పీఆర్సీ, హామీల ప్రభావం**




రెండు పీఆర్సీలు పెండింగ్‌లో ఉండటం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేకపోవడం అసంతృప్తికి కారణమవుతోంది. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం కూడా ఆందోళనను పెంచుతోంది.

**పాత బస్సులతో పెరిగిన ఒత్తిడి**

పాతబడ్డ బస్సులు కారణంగా పనిభారం పెరుగుతోంది. నిర్దేశిత సమయం కంటే ఎక్కువగా పని చేయాల్సి రావడం, తరచూ సాంకేతిక లోపాలు తలెత్తడం వల్ల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త బస్సులపై స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం కూడా అసంతృప్తిని పెంచుతోంది.

**సమ్మె ప్రభావం**

సమ్మె కొనసాగితే సంస్థకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. ప్రయాణికులతో పాటు అనుబంధ రంగాలపై ఆధారపడినవారికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**సంక్షేమ పథకాలపై ప్రభావం**

మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే పథకం అమలులో కూడా అంతరాయం ఏర్పడింది. రోజువారీగా దీనిపై ఆధారపడే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకానికి సంబంధించిన బకాయిల అంశం కూడా చర్చనీయాంశంగా మారింది.

**పరిష్కారం కోసం ఎదురుచూపులు**

ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చి సమస్యలను పరిష్కరించాలని కార్మిక వర్గాలు కోరుతున్నాయి. లేకపోతే సమ్మె మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## గ్లోబల్ ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ సెంటర్‌గా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

తయారీ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులోని 'ఆజాద్‌సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్'లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస్'ను ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బేకర్ హ్యూస్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తమ 'మేక్ ఇన్ ఇండియా' ప్రాజెక్టు కోసం హైదరాబాద్‌ను ఎంచుకోవడం తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమన్నారు. ఒకప్పుడు రక్షణ పరిశోధన సంస్థలు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు మాత్రమే నిలయమైన హైదరాబాద్ నేడు ప్రైవేట్ రంగంలోనూ ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరిశ్రమలకు గమ్యస్థానంగా మారిందన్నారు. అంతేకా 1500కు పైగా ఎంఎస్ఎంఈలతో హై ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్‌లోనూ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, జీఈ ఏవియేషన్, సాఫ్రాన్, ఎయిర్‌బస్, హనీవెల్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు సైతం తమ కార్యకలాపాలను విస్తరించేందుకు హైదరాబాద్‌ను ఎంచుకోవడానికి ఇక్కడి ఎకో సిస్టం కారణమన్నారు. ఆ దిశగా అప్పట్లో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన బలమైన పునాదులు ఇప్పుడు తెలంగాణను పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా మార్చాయన్నారు. మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో జాతీయ భద్రత కోసం అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని భరోసా ఇచ్చారు. కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు చేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ 'బేకర్ హ్యూస్ ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్ అండ్ ఎక్విప్‌మెంట్ (వోఎఫఎసఈ), ఇండస్ట్రియల్ అండ్ ఎనర్జీ టెక్నాలజీ(ఐఈటీ), టెక్నాలజీ అండ్ డిజిటల్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది.. ఈ సంస్థ ఐఈటీ విభాగానికి అవసరమైన హై ప్రెసిషన్ ఉత్పత్తులు తాజాగా ప్రారంభమైన ఈ యూనిట్ లో తయారవుతాయి.. కొత్తగా 230 మందికి ఉపాధి లభిస్తుంది అని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో బేకర్ హ్యూస్ ప్రతినిధులు డేవిడ్ మర్రానీ, స్టీఫెన్ హిన్సన్, మార్సెల్లో బారియాని, రోసానో చియెల్లి, మాసిమిలియానో తుర్సీ, మౌరో బ్రాకో, విశాల్ ముర్ధుడ్కర్, లియో డి ఫిలిప్పో, ఆజాద్ ఇంజనీరింగ్ చైర్మన్, సీఈవో రాకేష్ చోప్దార్, టీజీఐఐసీ ఎండీ శశాంక తదితరులు పాల్గొన్నారు.




### హామీలు నెరవేర్చాలంటూ ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**తెలంగాణ బ్యూరో ,సిరి న్యూస్,ఏప్రిల్ 23 :**

ఆర్టీసీ సమ్మె రెండవరోజు సంస్థ డ్రైవర్ ఆత్మహత్య ప్రయత్నం మూలంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది వరంగల్ జిల్లా.నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గా పనిచేస్తున్న శంకర్ గౌడ్ తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమ్మె నేపథ్యంలో ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని కోరుతూ, ఆయన తనపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు తోటి కార్మికులు తెలిపారు . ఈ ఘటనను గమనించిన సహచరులు వెంటనే స్పందించి ఆయనను అడ్డుకొని ప్రాణాపాయం నుంచి కాపాడారు. తీవ్రగాయాలపాలైన శంకర్ గౌడ్‌ను వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ లోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. గాయాలు తీవ్రంగా ఉండటం మూలంగా పరిస్థితి విషమంగానే ఉందని కార్మికులు తెలిపారు. సమ్మె రెండవరోజే ఇలా జరగడం పట్ల కార్మికుల్లో మరింత ఆగ్రహం పెరిగింది ఈ ఘటనతో ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆందోళన మరింత పెరిగింది. సమ్మె కొనసాగుతున్న సమయంలో ఈ సంఘటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# తిరగని ప్రగతి రథ చక్రాలు

- **రెండో రోజుకు ఆర్టీసీ కార్మికుల సమ్మె**
- **బలవంతంగా బస్సులు నడిపేందుకు పోలీసుల యత్నాలు**
- **పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**

ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం రెండో రోజు కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు కార్మికులను అరెస్టు చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు తిరగకపోవడంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుండగా వారు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకుని భారీ సంఖ్యలో చేరుకుని అడ్డుకున్నారు. బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొమ్మిది డిపోల్లో 600 బస్సులు నిలిచిపోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటుచేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా బస్సులు రెండో రోజూ డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మందిపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్టు చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**అద్దె బస్సులు నడిపేందుకు యత్నం**

జనగామ జిల్లాలో నిరసనకు దిగిన ఆర్టీసీ కార్మికులను అడ్డుకోవద్దంటూ ఓ ఆర్టీసీ కార్మికుడు పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకున్న సంఘటన ప్రతి ఒక్కరినీ కదలించింది. సీఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జనగామ డిపో వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డిపో నుండి బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి వివిధ ప్రాంతాలకు బస్సులను పంపిస్తున్నారు. ఈ క్రమంలో న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్డెక్కిన తమను అడ్డుకోవద్దంటూ ఓ కార్మికుడు పోలీసుల కాళ్లు మొక్కి వేడుకున్నాడు. కాగా, డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె ఆపేదే లేదని ఆర్టీసీ కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

# ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి**

కార్మికులకు విజ్ఞప్తి చేసింది. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సానుకూల దృక్పథంతో ఉందని స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది.

కార్మిక సంఘాల ప్రతినిధులతో శుక్రవారం చర్చలు జరపాలని సమావేశంలో నిర్ణయించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం ఈ చర్చలను నిర్వహించనుంది. కార్మికుల డిమాండ్లను సమగ్రంగా పరిశీలించి సాధ్యమైన పరిష్కారాలు తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. కార్మికులు కూడా సంయమనంతో చర్చలకు సహకరించాలని మంత్రివర్గం కోరింది.




ఇక కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన న్యాయ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పును మంత్రివర్గం సమీక్షించింది. కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమని హైకోర్టు అభిప్రాయపడినట్లు అడ్వకేట్ జనరల్ వివరించారు. ఈ అంశంపై న్యాయ నిపుణులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిల అంశంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. రెగ్యులర్ ఉద్యోగులకు రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు రూ.8 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజా ప్రతినిధుల జీతాల్లో 50 శాతం కోత విధించి ఆ నిధులను వినియోగించాలన్న ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపింది.

అలాగే ఆర్థిక వనరుల సమీకరణ కోసం ప్రత్యేక ఉపసంఘం ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ సంఘాలతో చర్చలు జరపాలని నిర్ణయించారు. ప్రజలపై అదనపు భారం లేకుండా సమస్యలకు పరిష్కారం కనుగొనాలని మంత్రివర్గం స్పష్టం చేసింది.

మరోవైపు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి క్రీడా మైదానాన్ని ప్రజా-ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో అభివృద్ధి చేయాలని ఆమోదం తెలిపారు. 76 ఎకరాల్లో ఆధునిక సదుపాయాలతో 21 రకాల క్రీడలకు అనువైన వసతులు ఏర్పాటు చేయనున్నారు. మంథని నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అయిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, అలాగే ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసరాల్లో సమగ్ర జల వ్యవసాయ పార్క్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. మొత్తానికి మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయాలు రాష్ట్రంలో కొనసాగుతున్న పలు సమస్యలకు పరిష్కారం దిశగా కీలకంగా మారనున్నాయి. కార్మికులు-ప్రభుత్వం మధ్య జరగబోయే చర్చలపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.

# విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

మొదటిపేజీ తరువాయి

బాలికల డార్మెటరీ హాల్‌ను ప్రారంభించారు. ఇటీవలే రూ.2.70 కోట్లతో బాలికల వసతి గృహాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమానికి ముందుగా రూ.కోటి అంచనా వ్యయంతో ప్రధాన బీటీ రహదారి నుండి పాఠశాల వరకు అప్రోచ్ బీటీ రహదారి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా మంచి ఆహారం తీసుకుంటూ మెరుగైన విద్యను అభ్యసించాలనే ఆశయంతో హాస్టళ్లలో ఉన్న బాలబాలికలకు ప్రభుత్వం నాణ్యమైన భోజనాన్ని అందిస్తోందన్నారు. ఇంటి వద్ద తల్లులు చేసే వంట రుచిని గుర్తు చేసేలా పోషకాహారంతో కూడిన మెనూను అమలు చేస్తూ, హాస్టళ్లలో సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుపై పూర్తి విశ్వాసంతో ఉందని, వారు తమ కాళ్ల మీద నిలబడి దేశాన్ని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగగలరని నమ్ముతున్నదని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎవరికీ చదువు ఆగిపోకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. పేదవారి పిల్లలు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను పొందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.65 కోట్లతో వివిధ నైపుణ్యాలపై శిక్షణ కేంద్రాలు (ఏటీసీ కేంద్రాలు) ఏర్పాటు చేdవివిధ రంగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు. ఈ శిక్షణల ద్వారా వారు స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వైద్య రంగంలో కూడా పేదవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ హాస్పిటల్స్‌ను బలోపేతం చేసి నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. పేదల పక్షపాతిగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో శాతం వంద ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్, సిబ్బందిని ప్రభుత్వం తరపున అభినందించారు. ఇదేవిధంగా భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు. ఈ నియోజకవర్గంలో కూడా ఈ పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతీ పేదవాడి సొంతింటి కలను నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు గిరిజనుల కోసం అదనంగా వెయ్యి ఇళ్లు మంజూరు చేసి నియోజకవర్గంలోని 380 గ్రామాలకు సుమారు 4500 ఇళ్లు ఆమోదించామని వివరించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు వంద పడకల హాస్పిటల్ నిర్మాణం చేపడుతున్నామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ డైట్ చార్జీలు పెంచి పోషకాహారం అందిస్తున్నదన్నారు. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నదని, ఈ అవకాశాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్ వంటి వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్లాసులు నిర్వహించి విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో శిక్షణ అందించనున్నామని తెలిపారు. పేరెంట్స్ మీటింగ్స్ ద్వారా తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుతూ విద్యార్థుల డ్రాపవుట్ రేటును తగ్గించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఉన్నతస్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ ఈ విద్యాసంస్థలో ప్రస్తుతం 584మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. 16 గదులతో నిర్మించిన కొత్త డార్మెటరీ ద్వారా సుమారు 600మందికి వసతి కల్పించగల సామర్థ్యం ఏర్పడిందన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉందని, ఐఐటీ తదితర ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గిరిజన గురుకుల విద్యాసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం రూ.53 కోట్లు మంజూరు చేయగా భద్రాచలం ఐటీడీఏకు రూ.6 కోట్లు, ఈ పాఠశాలకు రూ.25 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. గిరిజన పాఠశాలల్లో కూడా డిజిటల్ తరగతులు నిర్వహించేలా తగిన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గ్రామ సర్పంచ్ పూనెం రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మ్యూల్ ఖాతాలపై కఠిన చర్యలు

- **బ్యాంకులకు హెచ్చరిక**
- **సమన్వయ సమావేశంలో కీలక నిర్ణయాలు**
- **గ్రాహక భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**
- **'శూన్య మ్యూల్ ఖాతాలు' లక్ష్యంగా పని చేయాలని పిలుపు**

**హైదరాబాద్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**

మ్యూల్ ఖాతాల నియంత్రణపై కీలక సమన్వయ సమావేశాన్ని నిర్వహించినట్లు పోలీసు ఉన్నతాధికారి సజ్జనార్ తెలిపారు. సైబర్ నేరాల పెరుగుదల నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థలో భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో భారతీయ రిజర్వు బ్యాంకు ప్రాంతీయ సంచాలకుడు చిన్మయ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన సుమారు 75 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఉన్న సవాళ్లు, సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. బ్యాంకు అధికారులు కేవలం ఖాతాల ప్రారంభ లక్ష్యాలపై మాత్రమే దృష్టి పెట్టకుండా, గ్రాహకుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సజ్జనార్ సూచించారు. ఒక్క గ్రాహకుడు కూడా సైబర్ నేరాలకు బలికాకుండా చూడటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న మ్యూల్ ఖాతాలను పూర్తిగా అరికట్టేందుకు 'సురక్షిత గ్రాహక సవాలు'ను ప్రతి బ్యాంకు స్వీకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి శాఖ 'శూన్య మ్యూల్ ఖాతాలు' లక్ష్యంగా పని చేయాలని ఆదేశించారు. అలాగే, ఏ బ్యాంకు శాఖలోనూ సైబర్ బాధితులు ఉండకూడదని స్పష్టం చేశారు. జాతీయ సైబర్ నేర నివేదిక వేదికలో నమోదయ్యే ఫిర్యాదుల ఆధారంగా శాఖల పనితీరును అంచనా వేయాలని సూచించారు. బ్యాంకింగ్ వ్యవస్థలో భద్రతను పెంపొందించేందుకు ఈ సమావేశం కీలకంగా మారింది. మ్యూల్ ఖాతాల నియంత్రణ ద్వారా సైబర్ నేరాలను తగ్గించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.

# లండన్‌లో మొక్కలు నాటిన గ్రీన్ ఇండియా బృందం

- **పర్యావరణానికి కొత్త ఊపు**
- **గ్లోబల్ గ్రీన్ ఐకాన్ అవార్డు నేపథ్యంలో కార్యక్రమం**
- **సంతోష్ కుమార్‌తో కలిసి టాక్ సభ్యుల మొక్కల నాటకం**
- **పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కొనసాగిస్తామని హామీ**

**లండన్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ లండన్‌లో మొక్కల నాటకం నిర్వహించడం గొప్ప అనుభూతినిచ్చిందని టాక్ ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు తెలిపారు. గ్లోబల్ గ్రీన్ ఐకాన్ అవార్డును స్వీకరించడానికి లండన్‌కు వచ్చిన గ్రీన్ ఇండియా ఉద్యమ వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ మరియు వారి సతీమణి రోహిణితో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా టాక్ కార్యవర్గ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటారు. ప్రకృతిని ప్రేమించడం, మొక్కలను నాటడాన్ని సామాజిక బాధ్యతగా మార్చిన సంతోష్ కుమార్ కృషి వల్లే ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించిందని సుప్రజ పులుసు పేర్కొన్నారు. ఈ అవార్డు దేశానికి గర్వకారణమని అన్నారు. తెలంగాణ అసోసియేషన్ యునైటెడ్ కింగ్డమ్ సభ్యులు ఇప్పటికే పలు సందర్భాల్లో గ్రీన్ ఇండియా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారని, ఇకపై కూడా అదే స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణలో ముందుంటామని తెలిపారు. పర్యావరణ అవగాహన పెంపొందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఉద్యమ సహ వ్యవస్థాపకులు, పలు సంస్థల ప్రతినిధులు, ప్రవాస భారతీయులు పాల్గొన్నారు. వారు పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల నేపథ్యంలో ఇటువంటి కార్యక్రమాలు అత్యంత అవసరమని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ప్రకృతి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొత్తానికి, లండన్‌లో జరిగిన ఈ మొక్కల నాటకం కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు అంతర్జాతీయ స్థాయిలో సందేశం ఇచ్చింది. భవిష్యత్ తరాల కోసం ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ఈ కార్యక్రమం మరోసారి స్పష్టం చేసింది.

# ఎల్బీనగర్–హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు వేగం

- **7.1 కి.మీ. మేర ప్రతిష్టాత్మక నిర్మాణం**
- **₹941 కోట్లతో భారీ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది**
- **ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యం**

**హైదరాబాద్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**

ఎల్బీనగర్ నుండి హయత్‌నగర్ వరకు నిర్మించనున్న డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వం కీలక సమీక్ష నిర్వహించింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమై ప్రాజెక్టు పనుల స్థితిని పరిశీలించారు. సుమారు 7.1 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్న ఈ కారిడార్‌కు ₹941 కోట్ల అంచనా వ్యయం నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ₹200 కోట్లు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర రవాణా వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకుంటాయని ఆయన పేర్కొన్నారు. నాగపూర్ తర్వాత దేశంలోనే రెండో అతిపెద్ద డబుల్ డెక్కర్ కారిడార్‌గా ఇది నిలవనుంది. హైదరాబాద్–విజయవాడ రహదారిపై రోజువారీగా ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలను గణనీయంగా తగ్గించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా ఎల్బీనగర్, హయత్‌నగర్ ప్రాంతాల్లో వాహన రద్దీ అధికంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారిడార్ ద్వారా సుమారు 20 లక్షల మంది ప్రజలకు ప్రయాణం సులభతరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వేగవంతమైన, సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రావడంతో నగర అభివృద్ధికి ఇది తోడ్పడనుంది. ప్రాజెక్టు అనుమతుల కోసం త్వరలో కేంద్ర మంత్రిని కలిసి చర్చలు జరపనున్నట్లు మంత్రి తెలిపారు. అవసరమైన అనుమతులు త్వరితగతిన పొందేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కారిడార్‌ను ప్రమాద రహిత మార్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలతో నిర్మాణం చేపట్టి ప్రజలకు నాణ్యమైన సౌకర్యం అందించనున్నట్లు తెలిపారు.

ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణం నగర ట్రాఫిక్ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారంగా మారనుంది. నగర రవాణా వ్యవస్థను ఆధునీకీకరించే దిశగా ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు.

# మహిళా ఆగ్రహ యాత్రతో హైదరాబాద్‌లో ఉద్రిక్త వాతావరణం

- **వీధుల్లోకి వచ్చిన మహిళలు**
- **రాజకీయ పార్టీలపై తీవ్ర విమర్శలు**
- **నినాదాలతో మార్మోగిన నగర వీధులు**
- **పాల్గొన్న తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు**

**హైదరాబాద్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**

మహిళా ఆగ్రహ యాత్ర సందర్భంగా హైదరాబాద్ నగరంలో మహిళలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. వివిధ వర్గాలకు చెందిన మహిళలు పాల్గొని తమ ఆవేదనను బహిరంగంగా వ్యక్తపరిచారు.

ఈ యాత్రలో మహిళలు రాజకీయ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. తమ సమస్యలను పట్టించుకోలేదని, నమ్మకాన్ని ద్రోహం చేశారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం మరింతగా పోరాడతామని స్పష్టం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఈ యాత్రలో నినాదాలతో వీధులు మార్మోగాయి. మహిళలు ఐక్యంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం విశేషంగా నిలిచింది.

ఈ నిరసన కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా, మహిళల ఆవేదనకు ప్రతీకగా మారిందని పాల్గొన్న వారు పేర్కొన్నారు. మహిళా శక్తి మేల్కొన్నదని, ఇకపై తమ సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో నిరసన హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, మహిళలు కూడా అదే హక్కుతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. మహిళా ఆగ్రహ యాత్ర హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. మహిళల సమస్యలపై ప్రభుత్వం, రాజకీయ పార్టీలు స్పందించాలన్న డిమాండ్ మరింత బలంగా వినిపిస్తోంది.

# హైదరాబాద్‌లో భారీ కల్తీ టీ పౌడర్ దందా బట్టబయలు

**హైదరాబాద్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**

హైదరాబాద్‌లో మరో భారీ కల్తీ దందా బయటపడింది. హెచ్‌ఫాస్ట్ పోలీసుల గోప్య ఆపరేషన్‌లో సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్‌కు సంబంధించిన పదార్థాలను అధికారులు గుర్తించారు. వాడిన టీ పౌడర్‌ను తిరిగి రంగులు కలిపి విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ విధంగా తయారుచేసిన టీని కొన్ని టీ దుకాణాల్లో వినియోగిస్తున్నట్లు విచారణలో బయటపడింది.

ఈ ఆపరేషన్‌లో 10 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వారి వద్ద నుంచి భారీగా కల్తీ పదార్థాలు, తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌ఫాస్ట్ ఏర్పడిన తర్వాత నగరంలో కల్తీ దందాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవలే 14 టన్నుల కల్తీ మాంసం కేసు బయటపడిన నేపథ్యంలో ఈ ఘటన మరింత కలకలం రేపుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఈ తరహా అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొత్తానికి, హైదరాబాద్‌లో వరుసగా వెలుగుచూస్తున్న కల్తీ దందాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.

# హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వీసీ సజ్జనర్

**హైదరాబాద్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**

సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనర్ గురువారం హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలను చేపట్టారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆయనకు డీజీపీ హోదాలో పదోన్నతి కల్పించడంతో, నేడు అధికారికంగా ఈ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పదవీ స్వీకరణ అనంతరం నగరంలో శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన సంకేతాలు ఇచ్చారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్ వంటి మెట్రో నగరంలో పోలీసింగ్‌కు సాంకేతికతను మరింతగా వినియోగిస్తూ నేరాలను అరికట్టే చర్యలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ప్రజలతో సమన్వయం పెంచుతూ పారదర్శక పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

# పోలీసులపై ట్రిబ్యునల్ వేస్తాం

- **బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ స్వేరో హెచ్చరిక**
- **ఆర్టీసీ సమ్మె అణచివేతపై ఆగ్రహం**

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**

రాష్ట్రంలో పోలీసుల వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ స్వేరో తీవ్ర హెచ్చరికలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పోలీసులపై ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన పార్టీ కార్యకర్త బసిరెడ్డి సంతోష్ రెడ్డి అరెస్టు నేపథ్యంలో మహబూబ్‌నగర్ జైలును సందర్శించిన ఆయన, మాజీ ఎమ్మెల్యే ఆల్ల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డితో కలిసి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కార్యకర్తను అకారణంగా అరెస్టు చేసి జైలుకు పంపడం దారుణమని అన్నారు. ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను ఇథనాల్ ఫ్యాక్టరీ సమీపంలో ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సందేశం పంపినందుకు అరెస్టు చేయడం అన్యాయమని ఆయన విమర్శించారు. సాధారణ కార్యకర్తను నేరస్తుడిగా చిత్రీకరించడం పోలీసుల దుర్వినియోగానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రాణాలకు ముప్పు ఉందనే కేసులు నమోదు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను అణచివేయడానికి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. తాండూరులో సమ్మె చేస్తున్న కార్మికులకు టెంట్, నీళ్లు ఇవ్వొద్దని ఆదేశించడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. భారత రాజ్యాంగంలోని అభిప్రాయ వ్యక్తీకరణ, నిరసన హక్కులను ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలపై ఆధారాలతో ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గతంలో జరిగిన కొన్ని ఘటనల్లో రాజకీయ నాయకులపై చర్యలు తీసుకోకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. హేట్ స్పీచ్ బిల్లు గురించి మాట్లాడిన ఆయన, ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేసినా కేసులు పెట్టే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య హక్కులను కించపరచడమేనని అన్నారు.

# చెరువులతో పాటు ఎస్‌టీపీలు సిద్ధం కావాలి

- **హైడ్రా కమిషనర్ ఆదేశాలు**
- **ఇబ్రహీం బాగ్ చెరువు పనులపై ప్రత్యక్ష పరిశీలన**
- **పునరుద్ధరణలో రాజీ లేకుండా శాస్త్రీయ విధానాలు అనుసరణ**
- **మురుగు నీటి ప్రవాహ నియంత్రణకు సమగ్ర ప్రణాళిక**

**హైదరాబాద్, ఏప్రిల్ 23 సిరి న్యూస్:**

చెరువుల పునరుద్ధరణతో పాటు మురుగు నీటి శుద్ధి కేంద్రాలు సమయానికి సిద్ధంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. రాజేంద్రనగర్ మండలం ఇబ్రహీం బాగ్ చెరువును ఆయన సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. చెరువుల పునరుద్ధరణ భారీ వ్యయంతో జరుగుతున్నందున, పనులు పూర్తయ్యే సమయానికి ఎస్‌టీపీలు కూడా సిద్ధంగా ఉండాలని సూచించారు. లేకపోతే మళ్లీ మురుగు నీరు చేరి చెరువులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 56 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న శుద్ధి కేంద్రాల పనులను వేగవంతం చేయాలని జల మండలి అధికారులకు సూచించారు. చెరువులో పూడిక పూర్తిగా తొలగించాలని, అలా చేయడం వల్ల దుర్గంధం తగ్గి భూగర్భ జలాలు పెరుగుతాయని కమిషనర్ తెలిపారు. ఎస్‌టీపీ నుంచి వచ్చే నీటిని ముందుగా సెడిమెంటేషన్ కుంటలోకి తరలించి, తర్వాత ప్రధాన చెరువులోకి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు పరిధిలోని ఆక్రమణలను ఇప్పటికే తొలగించినట్లు అధికారులు తెలిపారు. చెరువు అభివృద్ధిలో శాస్త్రీయ విధానాలు పాటిస్తూ ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లను సమర్థంగా నిర్మించాలని కమిషనర్ ఆదేశించారు. వరద నీరు చెరువులోకి చేరేలా, మురుగు నీరు బయటకు వెళ్లేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# దశలవారీగా అంగన్‌వాడీల అప్‌గ్రేడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 22 సిరి న్యూస్:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాలతో దేశంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. బస్తీలు, గ్రామాల్లోని పేద, మధ్యతరగతి ప్రజల పిల్లలకు చిన్నతనం నుంచే సమాజం, ఆటపాటలు, విద్య, నైపుణ్యాల దిశగా ప్రేరేపించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తన సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను గురువారం పరిశీలించిన అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తొలి దశలో సొంత భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీలను లక్ష్యంగా చేసుకుని వాటిల్లో టీవీలు, ఫ్యాన్ల ఏర్పాటు, ఫ్లోరింగ్, కలరింగ్ పనులు, బుక్స్, బ్యాగ్స్, నీటి సదుపాయం, యూనిఫార్మ్ పంపిణీ చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని ప్రభుత్వ భవనాల్లో ఉన్న అన్ని అంగన్‌వాడీలను దశలవారీగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటైన బస్తీ దవాఖానలకు బడ్జెట్ కేటాయింపులు కేంద్రం నుంచే జరుగుతున్నాయని, వాటి అభివృద్ధి కోసం మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని కూడా తెలిపారు. సికింద్రాబాద్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన వైద్య పరికరాలను అందిస్తున్నామన్నారు.

**ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తాం.. సమస్యలు పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు కావస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ సమస్యల పరిష్కారానికి ఎందుకు అడుగు ముందుకు వేయలేదో చెప్పాలి అని కిషన్‌రెడ్డి నిలదీశారు. ఉచిత బస్సు పథకం వచ్చిన తర్వాత కార్మికుల సేవలు, బాధ్యతలు పెరిగాయి కానీ వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పరిష్కరించి సమ్మె విరమింపజేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నానన్నారు.

**జీహెచ్‌ఎంసీలో నిధుల కొరత.. అభివృద్ధి పనుల్లో జాప్యం**

ప్రస్తుతం జీహెచ్ ఎంసీ నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతోందని, నగరంలోని అనేక ప్రాంతాల్లో భూసేకరణ చేయడానికి కూడా ప్రభుత్వం దగ్గర నిధులు లేవని కిషన్‌రెడ్డి విమర్శించారు. దీనివల్ల నాలాల అభివృద్ధి, రోడ్ వెడల్పు పనులు కుంటుపడుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే జీహెచ్‌ఎంసీకి బడ్జెట్ కేటాయింపులు పెంచి నగరంలో మౌలిక వసతుల కల్పనకు కృషిచేయాలని డిమాండ్ చేశారు.

**హైకోర్టు తీర్పు పుణ్యం రేవంత్ రెడ్డిదే**

కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌కు ఊరట కలిగించింది హైకోర్టు కాదని రేవంత్ రెడ్డి ప్రభుత్వమంటూ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబంపై అనేక ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్ము లేకే తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రెండేళ్లు ఫామ్‌హౌస్‌లో పడుకుని ఇప్పుడు మళ్లీ కేసీఆర్ మో{ర్లకు మీటర్లు అంటున్నారని కేంద్ర మంత్రి సెటైర్ విసిరారు. పదేళ్ల నుంచి అదే పాట పడుతున్న కేసీఆర్ ఒక్కరోజూ దాన్ని నిరూపించలేకపోయారని విమర్శించారు. మైక్ దొరికితే ఆయనంత మేధావి ఎవరూ లేరని కేసీఆర్ అనుకుంటారన్నారు. ఆర్టీసీ కార్మికులకు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క జీవోతో వాళ్ల సమస్యలు పరిష్కారం అయ్యేవని, కానీ ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి ఇబ్బంది పెడుతున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రామాయంపేట మున్సిపాలిటీలో 'కో-ఆప్షన్' సెగ

- మైనంపల్లి ఆశీస్సుల కోసం ఆశావహుల క్యూ!
- నేడు సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులను సమర్పించాలి.

**రామాయంపేట, ఏప్రిల్ 23(సిరి న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యుల భర్తీకి అనుమతి ఇవ్వడంతో రామాయంపేటలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఎన్నికల అధికారులు కో ఆప్షన్ ప్రక్రియను ప్రారంభించి నామినేషన్ల స్వీకరణ చేపట్టడంతో ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. పట్టణానికి చెందిన నలుగురు సభ్యులను కోఆప్షన్ పద్ధతిలో ఎంపిక చేసే అవకాశం ఉండటంతో, ఆయా వర్గాల నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యారు.




### మైనంపల్లి ప్రసన్నం కోసం ఆశావహుల పాట్లు

నామినేటెడ్ పదవుల భర్తీలో మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నిర్ణయం కీలకం కావడంతో ఆశావహులు ఆయన నివాసానికి క్యూ కడుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు తమ అనుచరులతో కలిసి మైనంపల్లిని కలిసి విన్నవించుకుంటున్నారు. కొందరు నేతలు ఆయన కాళ్లకు మొక్కి ఆశీర్వాదం తీసుకుంటూ, పదవి కోసం తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ పదవిని దక్కించుకోవడానికి వారు పడరాని పాట్లు పడుతున్న దృశ్యాలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి.

### సామాజిక సమీకరణాలు, రిజర్వేషన్లు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రామాయంపేట మున్సిపాలిటీలో ఇద్దరు మైనారిటీలకు, ఇద్దరు బీసీ వర్గాల వారికి కోఆప్షన్ సభ్యులుగా అవకాశం లభించనుంది. ఈ నలుగురిలో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉండేలా సమీకరణాలు రూపొందించారు. దీంతో ఆయా వర్గాల్లోని కీలక నేతలు తమ సామాజిక వర్గ కోటాలో పదవిని దక్కించుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు.

### బరిలో నిలిచిన ప్రధాన అనుచరులు

ఈ పదవిని ఆశిస్తున్న వారిలో పట్టణంలోని సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు ప్రముఖంగా ఉన్నారు. దేమే యాదగిరి, అనిల్ కుమార్, చింతల యాదగిరి, సరాపు శ్యామ్, ఎనిశెట్టి అశోక్ గుప్తా వంటి నాయకులతో పాటు మైనార్టీ వర్గం నుంచి పాషా, అభిబ్ తదితరులు గట్టి పోటీ ఇస్తున్నారు. వీరిలో ఎవరికి మైనంపల్లి ఆశీస్సులు లభిస్తాయోనన్న ఉత్కంఠ పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది. మైనార్టీ వర్గం నుంచి మాత్రం పోటీ లేకుండా ఇద్దరి పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయి. ఆ ఇద్దరిలో తమ భార్యలకు వద్దు తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. ఈ మేరకు వారు మైనంపల్లి ని కలిసి విన్నవించినట్లు తెలుస్తుంది. ఈ విషయంలో మెజార్టీ సభ్యుల నిర్ణయం తీసుకోవాలని హనుమంతరావు సూచించారని తెలిసింది.

### ప్రస్తుత కౌన్సిలర్ల ప్రతిపాదనలు

రామాయంపేట మున్సిపాలిటీలోని 12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ 8 వార్డులను కైవసం చేసుకోగా, మిగిలిన 4 వార్డుల్లో ప్రతిపక్షాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అయితే, కాంగ్రెస్ పార్టీకి కౌన్సిలర్లు లేని వార్డుల నుంచి కోఆప్షన్ సభ్యులను ఎంపిక చేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ప్రస్తుత కౌన్సిలర్లు భావిస్తున్నారు. ఇదే విషయాన్ని వారు మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లి, ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తుది ఎంపిక ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

### నేడు నామినేషన్ లకు ఆఖరి తేదీ.

కో ఆప్షన్ సభ్యులుగా పోటీ చేసే వారు ఈనెల 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో తమ దరఖాస్తులు సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. మున్సిపల్ పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం ఉన్నవారు మాత్రమే పోటీకి అర్హులని తెలిపారు

# భగీరథ మహర్షి త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
- కలెక్టరెట్ లో ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ ప్రతినిధి, ఏప్రిల్23(సిరి న్యూస్)**

భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి★ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళుల ర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సగర వంశీయులైన భగీరథ మహర్షి గంగా నదిని స్వర్గం నుంచి భూమిపైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వి అని కొనియాడారు. భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తెచ్చిన మహనీయుడిగా భగీరథుని చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. అందుకే గొప్ప ప్రయత్నాలను 'భగీరథ ప్రయత్నం'గా పిలుస్తారని వివరించారు. అనంతరం అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి, నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి, డిపిఓ యాదయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో యూనస్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి గంగా కిషన్, సంఘ నాయకులు జిల్లా అధ్యక్షుడు సాయిలు ఉప్పల సాగర సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించాలి

- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

**మెదక్ ఏప్రిల్,23(సిరిన్యూస్)**

రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు.

గురువారం మెదక్ జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో విత్తన డీలర్లు,సహకార సంఘాల ప్రతినిధులు,ఎఫ్పీఓలు మరియు ఏఆర్ఎస్కే కేంద్రాల ప్రతినిధులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై,వారి ద్వారానే విత్తన ఉత్పత్తి చేపడుతుందని చైర్మన్ తెలిపారు. సేకరించిన విత్తనాలను కఠినమైన ప్రమాణ పరీక్షల అనంతరం ధృవీకరించి మాత్రమే రైతులకు అందజేస్తున్నామని అన్నారు.దీనివల్ల రైతులకు నాణ్యతపై పూర్తి భరోసా ఉంటుందని వివరించారు.




### వానకాలం సీజన్‌కు విత్తనాలు సిద్ధం

ప్రస్తుత వానకాలం (ఖరీఫ్) సీజన్‌కు సంబంధించి జిల్లాలో విత్తనాల కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.సన్న రకాలు: బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638.

**దొడ్డు రకాలు:** కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010.

పై రకాల విత్తనాలు నిల్వలో సమృద్ధిగా ఉన్నాయని, ప్రభుత్వం సూచించిన రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని ఆదేశించారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను కూడా సకాలంలో రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు.

### సహకార సంఘాల పాత్రపై సూచనలు

సహకార సంఘాలు, ఏఆర్ఎస్కే కేంద్రాలు కేవలం రాయితీ ఉన్న పచ్చిరొట్ట విత్తనాలపైనే కాకుండా, ఇతర పంటల విత్తనాలను కూడా రైతులకు అందించడంలో చొరవ చూపాలని కోరారు. లైసెన్స్ కలిగిన ప్రతి విత్తన డీలర్ విత్తనాభివృద్ధి సంస్థ ఉత్పత్తులను తప్పనిసరిగా విక్రయించాలని సూచించారు.

### మెదక్ జిల్లా సాగు అంచనాలు

మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేస్తున్నామని, అందుకు 82 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని తెలిపారు. ఇందులో కనీసం 40 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే నూతన విత్తన చట్టం ద్వారా రైతుల హక్కులతో పాటు, డీలర్ల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాపాడుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విత్తనాలను రైతులు కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి నిత్యానంద్ , జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పి ప్రభాకర్ రెడ్డి, ఏడీఏలు, ఎంఏఓలు, జిల్లా సహకార అధికారి, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, విత్తన డీలర్లు మరియు ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తలరక్షణ ధరించడం భారముకాదు బాధ్యత - నారాయణ

**మునిపల్లి ఏప్రిల్ 23 (సిరి న్యూస్)**

మునిపల్లి మండల కార్యాలయంలో కంప్యూటర్ నిర్వాహకులకు తలరక్షణల పంపిణీ కార్యక్రమాన్ని అల్లాపూర్ గ్రామ సర్పంచ్ నారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ, ఎంపీడీవో, ఎంపీఓ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ నారాయణ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా తలరక్షణ ధరిం చాలని సూచించారు. రోడ్డు ప్రమాదా లను నివారించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. తలరక్షణ ధరిం చడం భారము కాదు, బాధ్యత అని పేర్కొన్నారు.



# న్యాయం ఎప్పటికీ గెలుస్తుంది

## సాయిచరణ్ గౌడ్

## హరీష్ రావును కలిసి సెంగోల్ అందజేత

**రామచంద్రపురం, ఏప్రిల్ 23 (సిరి న్యూస్):**



జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే విధించడాన్ని న్యాయం, ధర్మం గెలిచిన సందర్భంగా భావిస్తున్నామని బీఆర్ఎస్ యువ నాయకుడు బాలగౌని సాయిచరణ్ గౌడ్ తెలిపారు.మాజీ మంత్రి టి. హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇది కేవలం న్యాయ విజయం మాత్రమే కాకుండా సత్యానికి లభించిన గౌరవం. ధర్మం, న్యాయం, నిష్పక్షపాతానికి ప్రతీకగా 'సెంగోల్'ను సమర్పించడం ద్వారా మా భావాలను వ్యక్తం చేశాం" అన్నారు.అలాగే, "ఈ తీర్పు కే. చంద్రశేఖర్ రావు, టి. హరీష్ రావు గార్లపై చేసిన ఆరోపణలకు గట్టి సమాధానం ఇచ్చింది. న్యాయం ఎప్పటికీ గెలుస్తుందనే విశ్వాసాన్ని ఈ పరిణామం మరింత బలపరిచింది" అని పేర్కొన్నారు.

# కాంగ్రేస్ పార్టీ మంచి నాయకున్ని కోల్పోయింది

## అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ



**జోగిపేట, ఏప్రిల్ 23, (సిరి న్యూస్ ):**

అందోలు పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ సులుగంటి సత్యవ్రత్ (68) అంత్యక్రియలు గురువారం జోగిపేటలో నిర్వహించారు. అంత్యక్రియలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ హాజరై నివాళులు అర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. కాంగ్రేస్ పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని ఆయన అన్నారు. అయోధ్య,కాశీ తీర్థయాత్రలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో బుధవారం రైలులోనే గుండెపోటుతో సత్యవ్రత్ మృతి చెందడంతో మద్య ప్రదేశ్‌లోని భోపాల్‌లోని ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అంబులెన్స్‌లో జోగిపేటకు తరలించారు. గురువారం ఉదయం నుంచే కాంగ్రేస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు, వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా నాయకులు, పట్టణ ప్రజలు వందల సంఖ్యలో వచ్చి ఆయనకు నివాళులు అర్పించారు. అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ పి.నారాయణ, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్లు సత్యవ్రత్ మృతి పట్ల సంతాపాన్ని తెలియజేసారు.

# హరీష్ రావును కలిసిన ఆదర్శ్ రెడ్డి

## కాళేశ్వరం తీర్పుపై అభినందనలు



**రామచంద్రపురం, ఏప్రిల్ 23 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పు నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై వచ్చిన తీర్పు న్యాయం జరిగిందనే విషయాన్ని స్పష్టం చేసిందని అన్నారు. ఇది రాజకీయ కక్షసాధింపులకు గట్టి సమాధానమని పేర్కొన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ ఎల్లప్పుడూ నిలుస్తుందని, ప్రభుత్వం రైతులకు న్యాయం చేయడంతో పాటు ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి సారించాలని కోరారు.అదేవిధంగా, ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా మక్కల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలాను బాల్‌రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం విషయంలో ప్రభుత్వానికి హైకోర్టు గట్టి షాక్

**రాజకీయ కక్షసాధింపులకు చెంపపెట్టు**

**బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి**



**రామచంద్రపురం,(పటాన్‌చెరు), ఏప్రిల్ 23, (సిరి న్యూస్):**

"కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం చేసిన ఆరోపణలకు తెలంగాణ హైకోర్టు తీర్పు గట్టి సమాధానం ఇచ్చింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై స్టే విధించడం ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపులకు చెంపపెట్టుగా నిలిచింది" అని బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి అన్నారు.పటాన్‌చెరులో జరిగిన బీఆర్ఎస్ ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, "ఆ నివేదిక వాస్తవాలను ప్రతిబింబించకుండా పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో రూపొందించబడింది. గత కొన్ని సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై చేసిన ఆరోపణలు న్యాయస్థానం ముందు నిలవలేక పోయాయి" అని విమర్శించారు."రైతులకు సాగునీరు అందించాల్సిన ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్వహణలో నిర్లక్ష్యం చూపుతోంది. దీని వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా, "ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి పెట్టాలి. రైతు బంధు, రైతు భీమా పథకాలను నిరంతరం కొనసాగించాలి. ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మక్కల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి" అని డిమాండ్ చేశారు."ఇకనైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలు పక్కనపెట్టి రైతులకు క్షమాపణ చెప్పాలి" అని ఆదర్శ్ రెడ్డి స్పష్టం చేశారు.

## మహిళల భద్రత సామాజిక బాధ్యత

**డాక్టర్ అఫ్రీన్ వసీం**



**రామచంద్రపురం,(పటాన్ చేరు), ఏప్రిల్ 23, (సిరి న్యూస్):**

మహిళలు భయం లేకుండా స్వేచ్ఛగా జీవించగల వాతావరణాన్ని కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గీతం అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అఫ్రీన్ వసీం పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ నిర్వహించిన సెమినార్‌లో ఆమె ప్రసంగించారు.'భయంలో జీవించడం' అంశంపై మాట్లాడుతూ, లైంగిక హింస ముప్పు మహిళల మానసిక ఆరోగ్యం, ప్రవర్తన, రోజువారీ జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ఈ భయం కారణంగా మహిళలు అధిక జాగ్రత్తలు, పరిమిత జీవన శైలిని అవలంబించాల్సి వస్తోందని తెలిపారు.మహిళల భద్రత కోసం బలమైన చట్ట అమలు, సకాలంలో న్యాయం, సహాయక కుటుంబ వాతావరణం అవసరమని ఆమె నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## నామినేట్ పదవులు ఎవరికి

- **మెదక్ మార్కెట్ కమిటీ చైర్మన్**
- **నర్సాపూర్ మార్కెట్ కమిటీకౌడిపల్లి ఆత్మ కమిటీల్లో ఎవరికి ఎవరికి అవకాశం**
- **రెడ్డి సామాజిక వర్గానికి పెద్దపీట ఎస్సీ ఎస్టీ**
- **బీసీ వర్గాలకు అవకాశం**
- **ఏడుపాయల వనదుర్గా భవాని దేవస్థానం డైరెక్టర్లు కళ్ళేనా**

**కొల్చారం ఏప్రిల్ 23 )సిరి న్యూస్)**

నర్సాపూర్ నియోజకవర్గంలో నామినేట్ పదవుల కోసం ఎక్కువ సంఖ్యలో ఆశావాహులు ఎదురుచూస్తున్నారు ఇప్పటివరకు జరిగిన నామినేట్ పదవులు ఎక్కువ సంఖ్యలో రెడ్డి సామాజిక వర్గం పెద్దపీట వేశారు ఇప్పటివరకు ఎస్ టి ఎస్ సి వర్గాలను రిజర్వేషన్ వస్తే తప్ప నామినేట్ పెదవులు కేటాయించలేక పోయారు ఇక బిసి వర్గానికి చెందిన చాలామందికి ఇప్పటివరకు ఆకాశం కల్పించలేకపోయారు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకులు తమ సామాజిక వర్గానికి పెద్ద పీట వేసేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయా గ్రామాలలో గుసగుసలాడుతున్నాయి దీంతోపాటు తీవ్ర ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికలలో చాలామంది తక్కువ ఓట్లతో ఓడిపోవడంతో మేము కష్టపడ్డాం మాకు అవకాశం కల్పించాలని రాష్ట్రస్థాయి నాయకులతో సంప్రదింపులు బతిమిలాటలు ఊపందుకున్నాయి దీంతో నాయకులు తల పట్టుకుంటున్నారు దాదాపు రెండు పర్యాయాలు ఎమ్మెల్యే మదన్ రెడ్డి అధికార టిఆర్ఎస్ పార్టీలో ఉండగా అప్పుడు సైతం నామినేట్ పదవులు కొంత న్యాయం చేసినప్పటికీ నర్సాపూర్ అసెంబ్లీ స్థానం సునీత లక్ష్మారెడ్డి గెలవడంతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి తన వర్గానికి నోమినేట్ పదవులు కేటాయించేందుకు ఒత్తిడికి గురవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ అత్యంత విశ్వసనీయమైన కార్యకర్తలు ఉన్నప్పటికీ కేటాయింపులు మాత్రం ఎస్సీ ఎస్టీ బీసీ వర్గానికి కేటాయింపులు ఏ విధంగా ఉంటాయో వేచి చూడాలి మరి.

# ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

- **ఫీజులు రాక విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు.**
- **హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం మౌనం సరికాదు.**
- **ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్**
- **సీఎం ఇంటికి పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ చేసిన విద్యార్థి నేతలు**




**హైదరాబాద్ బ్యూరో, సిరి న్యూస్ (ఏప్రిల్23)**

బకాయిపడ్డ ఫీజు రియాంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.గురువారం నాడు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో పెండింగ్ స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర అనే కార్యక్రమ గోడ పత్రికను హిమాయత్ నగర్ లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫీజు బకాయి విడుదల కాక ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు కట్టి పరీక్ష ఫీజులు కట్టాలని, హాల్ టికెట్స్, సర్టిఫికెట్లు తీసుకోవాలని వేధిస్తున్నాయనీ ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు పేద, మధ్య తరగతి విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందని ఫీజు రియింబర్స్మెంట్ రాని విద్యార్థుల వద్ద నుండి ఫీజులు వసూలు చేసుకోమని వచ్చిన తర్వాత విద్యార్థులకు చెల్లించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని ఈ తీర్పుపై ప్రభుత్వం ఇప్పటికి స్పందించకుండా మౌనంగా ఉండడం వల్ల ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తున్నాయని, రాష్ట్రంలో లక్షలాదిమంది విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్ పథకం పై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. అలాంటి ఫీజు రియింబర్స్మెంట్ పథకానికి బకాయిలు ఇవ్వకుండా గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వాలు విద్యార్థుల చదువులతో చెలగాటమాడుతున్నాయని,ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ప్రవవేశపేడితే విద్యార్థులు ఆ పథకం కింద చేరి చదువుకుంటున్నారని, విద్య సంవత్సరం పూర్తి అయిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం వెళ్తే యాజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్నారని, లక్షలాది మంది విద్యార్థులు ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోకుండా ఉన్నత విద్యకు దూరంగా ఉంటున్నారని, రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా పైసలు కట్టి సర్టిఫికెట్ తీసుకునే ఆర్థిక పరిస్థితులు లేరని, హైకోర్టు ఫీజు రియింబర్స్మెంట్ విడుదలపై ప్రభుత్వానికి ఒక తేదీ డెడ్ లైన్ విధించి ఆలోపు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని, ఫీజులు వసూలు చేసుకోవాలని కళాశాలలకు హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైంది కాదని ఈ తీర్పుపై ప్రభుత్వంలో, రేవంత్ రెడ్డికి చలనం కలిగి వెంటనే రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఏకకాలంలో మొత్తం విడుదల చేయాలని, 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఆసరాగా ప్రవేశపెట్టిన ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని నేడు రాష్ట్రంలో సీఎంగా విద్యాశాఖ తన వద్ద పెట్టుకున్న రేవంత్ రెడ్డి బకాయిలు ఇవ్వకుండా రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తున్నారని, హైకోర్టు తీర్పును పున సమీక్షించి ఆలోచించాలని, పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రతి విద్యార్థి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్రకు తరలిరావాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెహమాన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి అన్వర్, చైతన్య యాదవ్, అనిల్, నాయకులు నెల్లి సత్య ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శం

- **రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా..**



**రామాయంపేట, ఏప్రిల్ 23(సిరి న్యూస్**

భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తాయని రామాయంపేట మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా తెలిపారు. గురువారం నాడు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆమె కౌన్సిలర్లతో కలిసి హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సగర వంశీయులైన భగీరథ మహర్షి గంగా నదిని స్వర్గం నుంచి భూమిపైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వి అని కొనియాడారు. భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని చైర్ పర్సన్ పేర్కొన్నారు.నిశ్చలమైన పట్టుదలకు, కఠోర దీక్షకు మారుపేరు మహర్షీ భగీరథుడు. దివి నుంచి భువికి గంగను రప్పించి, మానవాళికి జీవజలాన్ని అందించిన ఆ మహనీయుని జయంతిని జరుపుకోవడం అదృష్ట నియమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత గణేష్,7వ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు, 6వ వార్డ్ కౌన్సిలర్ పుట్టి సందీప్, 8వ వార్డు కౌన్సిలర్ శంకర్ గౌడ్, 9వవార్డు కౌన్సిలర్ దేవుని రంజిత్,10 వార్డు కౌన్సిలర్ మద్దెల మాధవి రమేష్,11వ వార్డ్ కౌన్సిలర్ దాకి శ్యామల స్వామి,కాంగ్రెస్ నాయకులు చింతల స్వామి,చిలుక విరాట్, సుధీర్ గౌడ్, దేవుని నరేష్ పోచమ్మల భాను, నరేందర్, నాగేంద్ర, గణేష్,సాయి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **ప్రజలకు ఇబ్బందులు తలెత్త కుండా చూడాలి**
- **ఆర్టీసీ సమ్మె పై నిర్లక్ష్యం చేయొద్దు**
- **కార్మికులతో చర్చలు జరిపి సమ్మె విరమింప జేయాలి**
- **మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి**




**మెదక్ ప్రతినిధి, ఏప్రిల్23(సిరి న్యూస్)**

ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడిచిపెట్టి తక్షణమే చర్చలు ప్రారంభించి, కార్మికుల అన్యాయమైన డిమాండ్ లను పరిష్కరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ డిమాండ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మెదక్ ఆర్టీసీ డిపో గుల్షన్ క్లబ్ వద్ద కొనసాగుతున్న కార్మికుల రెండొవ రోజు సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులతో కలసి ర్యాలీగా డిపో వరకు వెళ్లి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ హామీలు అన్ని గంగలో కలిసాయని,ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పుడు అమలు కాకుండా తూతూమంత్రంగా పరిపాలన సాగుతోందని, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శలు గుప్పించారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సమ్మె కొనసాగడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. గతంలో . మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ, సరైన గుర్తింపు ఇచ్చి గౌరవాన్ని కాపాడారని గుర్తు చేశారు.ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వంలో విలీనం, పీఆర్సీ ఫిట్‌మెంట్ వంటి హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. దీనివల్ల కార్మికులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు టెంట్లు వేసుకుని సామరస్యంగా సమ్మె కొనసాగిస్తున్నప్పటికీ, మెదక్ ప్రాంతంలో మాత్రం పోలీసులు కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా మహిళా కార్మికులను కూడా పట్టించుకోకుండా అరెస్టు చేసి పాపన్నపేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం తీవ్రంగా ఖండించారు.అరెస్టు చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు పూర్తి స్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా వాయిదాలు వేయడం వల్ల కార్మికుల్లో ఆందోళన పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముకలైన ఆర్టీసీ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదని, ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.ఉద్యోగాల భర్తీ, బకాయిల చెల్లింపు, సంఘ ఎన్నికల నిర్వహణ, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్ వంటి కీలక డిమాండ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులు సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ వారికి సరైన హక్కులు, భద్రత కల్పించకపోవడం అన్యాయమని విమర్శించారు. వారి శ్రమ దోపిడీని అరికట్టి తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ గడువు కోరడం సమ్మెను నీరుగార్చే ప్రయత్నంగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ విధమైన ఆలస్యం సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తుందన్నారు. కమిటీలు, నివేదికల పేరుతో కాలయాపన చేయకుండా ప్రత్యక్షంగా కార్మిక సంఘాలతో చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.సమ్మె కారణంగా సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం దెబ్బతింటోందని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే చర్చలు ప్రారంభించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సంస్థ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమం కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ మల్లికార్జున్ గౌడ్,జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యం.లావణ్య రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి,న్యాయవాది జీవన్ రావు,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిల్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు సోహెల్ జుబేర్ దీపక్ కుమార్, మెదక్ మాజీ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు గడ్డమీద కృష్ణ గౌడ్,లింగారెడ్డి,సురేందర్ గౌడ్, వెంకటేశం,కాశినాథ్ రావు, అంజి రెడ్డి, వేణు,సాయికుమార్, రంజిత్, స్వామి నాయక్, యంబిపూర్. మహేష్ చంద్ పాషా, ఆర్టీసీ జేఏసీ జేఏసీ నాయకులు ఏంఆర్కే రావు, ఆర్టీసీ కార్మికులు,సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు..



# పీసీ ఘోష్ కమిటీ నివేదిక కాళేశ్వరంలో కలిసింది





- **కెసిఆర్, హరీష్ రావు కడిగిన ముత్యంలా వచ్చారు**
- **ఘోష్ కమిషన్ నివేదిక పై హై కోర్ట్ తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు**
- **మాజీ మంత్రి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**నర్సాపూర్ ఏప్రిల్ 23 (సిరి న్యూస్)**

కాళేశ్వరం ప్రాజెక్ట్ పై అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన పీ సి ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ నర్సాపూర్ చౌరస్తాలో కేసీఆర్ హరీష్ రావు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు అనంతరం కార్యకర్తలు స్వీట్లు తినిపించుకుంటు ఆనందం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా ఘోష్ కమిషన్ పై ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని గతంలో ఎడారి లాంటి తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయుటకు కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి రైతులకు ఎంతో మేలు చేశారని 96 వేల కోట్ల రూపాయలతో తక్కువ సమయంలో ప్రాజెక్ట్ పూర్తి చేశారని అపర భగీరథుడు అయిన కెసిఆర్ పై రేవంత్ రెడ్డి ఇర్ష తో అనేక మాటలు అంటూ కాళేశ్వరం కూలిందని నిందలు వేశారు. కోర్టు సహజ న్యాయ సూత్రాల బద్ధంగా ప్రాథమిక హక్కులకు భంగం కలిగే విధంగా వ్యక్తిగత ప్రతిష్ట దిగజారి విధంగా ఏకపక్షంగా రిపోర్టు ఉందని ఏటువంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు తెలిపిందని అన్నారుపిసి ఘోష్ కమిటీ రిపోర్టు కాళేశ్వరం గంగలో కలిసిందని ప్రాజెక్ట్ కుంగలేదని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు కూలిపోయాయని అన్నారు 96 వేల కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే లక్ష కోట్ల రూపాయల అవినీతి అంటూ అసత్య ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కెసిఆర్ కేటీఆర్ హరీష్ రావు అంటే వారి పైన కాళేశ్వరం పేరుతో, ఫార్ములా రేస్ పేరుతో,ఫోన్ ట్యాపింగ్ అంటూ రోజు రోజు మాటలు చెప్పుతూ ప్రజల దృష్టి మళ్లించి డైవర్షన్ రాజకీయాలు చేసి అధికారంలోకి వచ్చిందని డైరెక్షన్ రాజకీయాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటు అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హై కోర్ట్ తీర్పుతో హరీష్ రావు కేసీఆర్ కేటీఆర్ కడిగిన ముత్యం లాగా బయటికి వచ్చారని ఇది తెలంగాణ ప్రజల విజయం అని కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్ట్‌ను రక్షించడం, రైతుల ప్రయోజనాలను కాపాడడం బాధ్యతగా భావిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు విసిగి చెందారని మళ్లీ కెసిఆర్ ప్రభుత్వమే రావాలని ప్రజలలో ఉందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్ మండల అధ్యక్షులు శేఖర్ పట్టణ అధ్యక్షులు బిక్షపతి కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# విద్యార్థులు తార్కిక ఆలోచన పెంపొందించుకోవాలి

- **'ఫస్ట్ ఇన్ మ్యాథ్'తో గణితం సులభం**
- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ (సిరి న్యూస్):** విద్యార్థులు తార్కిక ఆలోచన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఫస్ట్ ఇన్ మ్యాథ్'తో గణితం సులభతరం అవుతుందని, గణితంపై ఉన్న భయాన్ని వీడాలని సూచించారు. విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని తొలగించి వారిని ఉత్తమ సమస్యా పరిష్కర్తలుగా తీర్చిదిద్దేందుకు 'ఫస్ట్ ఇన్ మ్యాథ్' వంటి వినూత్న కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. వికసిత భారత్ లక్ష్యంగా విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యవంతులుగా తీర్చిద్దాలని ఆకాం క్షించారు. కాలానికి అనుగుణంగా విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా విమర్శనాత్మక ఆలోచన, తార్కిక విశ్లేషణ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. 1988 సంవత్సరం నుంచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన 'ఫస్ట్ ఇన్ మ్యాథ్'కార్యక్రమం ద్వారా గణితాన్ని సులభంగా, ఆసక్తికరంగా నేర్చుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించి వారి ప్రతిభను వెలికితీస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలో ఆర్టీసీ సజావుగా నడిచింది

- **మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**
- **ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావం**



**సత్తుపల్లి (సిరి న్యూస్):** కేసీఆర్ హయాంలో ఆర్టీసీ సజావుగా నడిచిందని, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అండగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఆర్టీసీ బస్ డిపో ఎదుట రెండో రోజు కొనసాగుతున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు 2021 వేతన సవరణలో భాగంగా 30శాతం ఫిట్మెంట్ అమలు చేయాలని కోరారు. అలాగే మహాలక్ష్మి పథకం కింద ప్రతినెల రూ.400 కోట్లను ఆర్టీసీకి కేటాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు అద్దె బస్సులను రద్దు చేయాలని సూచించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని, చర్చల ద్వారా వెంటనే పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. ఆర్టీసీ వంటి ప్రజా రవాణా వ్యవస్థ బలపడాలంటే కార్మికుల సంక్షేమం అత్యంత ముఖ్యమని, వారి హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు.

# భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**తాండూర్ (సిరి న్యూస్):** భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు సమర్పించిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మనోజ్తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను రికార్డులతో సరిచూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం నెన్నెల, తాండూర్ తహశీల్దార్ కార్యాలయాలను సందర్శించి సంబంధిత తహశీల్దార్లు శ్రీనివాస్, జ్యోత్స్నలతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాలికలకు సురక్షిత భవిష్యత్తు కోసం టీకా కార్యక్రమం



**తాండూర్ (సిరి న్యూస్):** బాలికలకు సురక్షిత భవిష్యత్తు కోసం టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఝాన్సీ అన్నారు. తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్పీవీ వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలిపారు. గురువారం 12 మంది బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ అందించినట్లు పేర్కొన్నారు. మండలంలో 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు ఈ వ్యాక్సిన్ అందిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 161 మంది అర్హులైన బాలికలను గుర్తించగా, ఇప్పటివరకు 49 మందికి వ్యాక్సినేషన్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వికల్ క్యాన్సర్) సహా పలు రకాల క్యాన్సర్లను నివారించడంలో ఈ వ్యాక్సిన్ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ వయసులో బాలికల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉండటంతో వ్యాక్సిన్ మరింత ప్రభావవంతంగా పనిచేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో మహిళల్లో సర్వికల్ క్యాన్సర్ నివారణకు హెచ్పీవీ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని, వ్యాక్సినేషన్ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని వివరించారు.

# పీచరను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం



**నేరడిగొండ (సిరి న్యూస్):** పీచరను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ బైరి లింగవ్వ రాజేందర్ అన్నారు. గ్రామ ప్రజల చిరకాల కోరిక మేరకు సుమారు రూ.3 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధియే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



**తాండూర్(సిరి న్యూస్):** ప్రభుత్వ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బెల్లంపల్లి టీఆర్ఈఏ శాఖ అధ్యక్షుడు సాధు లింగయ్య, కార్యదర్శి కె.నర్సయ్యలు అన్నారు. తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఆర్ఈఏ)లో తాండూర్ మండలానికి చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయులకు గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బోయపల్లి గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు మాసాడి శ్రీరాములు, గట్టు శ్రీహరి, ముద్దు రాంబాబు, ఇందూరి ఆశన్నలను టీఆర్ఈఏ సభ్యులుగా నమోదు చేసి రశీదులు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నుంచి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ను ఒకేసారి విడుదల చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్లో ఉన్న ఐదు డీఏలు, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలని కోరారు. 398 వేతనంపై నియమితులైన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగితే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి జగన్మోహన్ చారి, ముఖ్య సలహాదారులు అక్కపెల్లి బాపు, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

# వేసవి తాపానికి ఉపశమనం.. చలివేంద్రం




**సత్తుపల్లి(సిరి న్యూస్):** వేసవిలో చలివేంద్రం ప్రజల దాహార్తిని తీర్చి ఉపశమనం కలిగిస్తుందని వేంసూర్ మండల తహశీల్దార్ మాణిక్ రావు అన్నారు. వేంసూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద వేంసూర్ సర్పంచ్ మొహమ్మద్ ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని. గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు చల్లటి తాగునీరు అందించేందుకు సర్పంచ్ తీసుకున్న ఈ ముందడుగు అభినందనీయమని కొనియాడారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలు, బాటసారులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కిషోర్ బాబు, కార్యాలయ సిబ్బంది, సర్పంచ్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని నిర్వీర్యం చేస్తే ఊరుకోం

## కార్మికులకు అండగా నిలుస్తాం

## బీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్




**రామచంద్రపురం, ఏప్రిల్ 23 (సిరి న్యూస్):**

బిహెచ్ఈఎల్ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఆర్టీయూ రాష్ట్ర నాయకత్వం సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్ సమ్మె స్థలానికి చేరుకుని కార్మికులను పరామర్శించి తమ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా యాదగిరి యాదవ్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేసి కార్మికులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్మికుల పక్షాన పోరాటం చేసేందుకు తాము సిద్దంగా ఉన్నామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆర్టీసీని ప్రభుత్వ సంస్థలో విలీనం చేయాలని, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, యూనియన్‌లను పునర్వ్యవస్థీకరించాలని, గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు అండగా నిలిచిందని పేర్కొన్న యాదగిరి యాదవ్, కార్మికుల హక్కులు సాధించే వరకు వారి సమ్మెకు పూర్తి మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ధర్మం నిలిచింది న్యాయం గెలిచింది

## కాళేశ్వరం పై విపక్షాల అసత్యాలు భస్మం

## హైకోర్టు తీర్పుతూ కేసీఆర్కు భారీ ఊరట

## కుట్రల కోటలు బద్దలు

## మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

**అమీన్ పూర్ ఏప్రిల్ 23 సిరి న్యూస్**



కాళేశ్వరం ప్రాజెక్టు పై వచ్చిన తీర్పు న్యాయం జరిగిందన్న విషయాన్ని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసిందని మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం తీర్పుతో ధర్మం గెలిచింది, కెసిఆర్ పై బురద చల్లిన వారికే పరాభవం ఎదురైందని తెలిపారు. అబద్ధపు ప్రచారాలు తుడిచిపెట్టుకు పోయాయి, న్యాయం వెన్నంటే ఉంది అని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత కొంతకాలంగా జరుగుతున్న అసత్య ప్రచారాలకు ఈ తీర్పుతో తెరపడింది. ధర్మం ఎప్పుడూ గెలుస్తుందని మరోసారి నిరూపితమైందని అన్నారు. కుట్రలు భగ్నం రాజకీయ లబ్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై ప్రాజెక్టు పై బురద చల్లాలని చూసిన విపక్షాల ప్రయత్నాలు విఫలమయ్యాయి అని అన్నారు.తిప్పి కొట్టిన నిజం ప్రాజెక్టుపై వారు వేసిన నిందలు వారికే శాపంగా మారాయి, విమర్శలు చేసిన వారి మోకాలపైనే బురద పడిందని స్పష్టమవుతుంది.

# వృద్ధుల యోగ క్షేమాలపై ఆరా

## వృద్ధులకు అండగా న్యాయ సేవలు

## నాణ్యమైన ఆహారం మెరుగైన వైద్యం అందించాలి

## ఆశ్రమంలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి

## ఆశ్రమాన్ని సందర్శించిన న్యాయమూర్తి సౌజన్య



**అమీన్ పూర్ ఏప్రిల్ 23 సిరి న్యూస్**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి సౌజన్య అమీన్పూర్ లోని వృద్ధాశ్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ నాన్నల యోగక్షేమమే ముఖ్యం జడ్జి సౌజన్య,వృద్ధాశ్రమం నందు ఉన్న గదులు, వంటగది ,మరియు బాత్రూంలు, వృద్ధాశ్రమం ఆవరణ మొత్తం, తిరిగి పరిశీలించింది. ఆశ్రమంలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి వృద్ధులతో మాట్లాడమని తెలిపారు.చట్టపరమైన సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వృద్ధులకు సూచించారు. సేవాధికార సంస్థ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ 15100 నందు కూడా ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సేవలు అంతరాయం లేకుండా కొనసాగాలి

- **బస్టాండ్ల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్త్**
- **జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాస రావు**

**మెదక్ ఏప్రిల్,23(సిరిన్యూస్)**




ఆర్టీసీ సేవలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా పోలీస్ శాఖ పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు తెలిపారు.టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో మెదక్ జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైందని,ప్రజా రవాణా సేవలు నిరంతరంగా కొనసాగేందుకు భద్రతా చర్యలను బలోపేతం చేసిందన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించి పరిస్థితులను ఎస్పీ పరిశీలించారు.డిపో మేనేజర్ సురేఖతో మాట్లాడిన ఎస్పీ, ప్రస్తుతం నడుస్తున్న బస్సుల సంఖ్య, సేవల స్థితిగతులను తెలుసుకున్నారు. సమ్మె ఉన్నప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రవాణా సేవలు సజావుగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బస్టాండ్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రైవేట్ డ్రైవర్లు, సిబ్బంది భయపడాల్సిన అవసరం లేదని, వారికి పూర్తి భద్రత కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగించే చర్యలు, బస్సులకు నష్టం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాన్ని సహించబోమని హెచ్చరించారు. అటువంటి ఘటనలు జరిగితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం లో డియస్పీ ప్రసన్న కుమార్, డిపో మేనేజర్ సురేఖ, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానెమ్మ సేవలు మరువలేనివి

- **అభినందించిన గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయ బృందం**

**వెల్దుర్తి ఏప్రిల్ 23, (సిరి న్యూస్ ):**



పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్ర స్థలం. ఇలాంటి స్థలంలో పనిచేసే ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో గొప్పది. అందులో ముఖ్యంగా ప్రతిరోజూ పాఠశాల శుభ్రతను కాపాడుతూ సేవ చేస్తున్నవారు స్వీపర్లు. అలాంటి సేవామూర్తుల్లో మణెమ్మ పేరు ప్రత్యేకంగా చెప్పుకోవాలి అని హెచ్వోడి సాంబయ్య అన్నారు. గురువారం పదవి విరమణ సందర్భంగా మానెమ్మకు పాఠశాలలో గ్రామస్తులు అలాగే ఉపాధ్యాయ బృందం సన్మాన కార్యక్రమం నిర్వహించారు.మణెమ్మ 34 సంవత్సరాల పాటు పార్ట్ టైం స్వీపర్‌గా పనిచేసి వెల్దుర్తి పాఠశాలకు అపూర్వమైన సేవలను అందించారు. ఆమె పని కేవలం శుభ్రపరిచే పని మాత్రమే కాదు, అది ఒక విధమైన బాధ్యత, ఒక అంకితభావం. ప్రతిరోజూ తెల్లవారుజామునే పాఠశాలకు వచ్చి తరగతి గదులు, ప్రాంగణం శుభ్రంగా ఉంచడం ద్వారా విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించి అందరి ఉపాధ్యాయులకు అందించిన మాతృమూర్తి లాగా భావించే మణెమ్మ గురించి మనము ఎన్ని మాట్లాడినా తక్కువనే.ఆమె పని విధానం ఎంతో క్రమశిక్షణతో, నిబద్ధతతో కూడి ఉండేది. ఎలాంటి పరిస్థితులు వచ్చినా, ఆమె తన పనిని విస్మరించలేదు. వర్షం, ఎండ, వ్యక్తిగత కష్టాలు – ఇవన్నీ ఉన్నప్పటికీ, ఆమె తన విధిని ఎప్పుడూ మానలేదు. ఆమె కృషి వల్లే వెల్దుర్తి పాఠశాల ఎల్లప్పుడూ శుభ్రంగా, సక్రమంగా ఉన్నది.మణెమ్మ కేవలం ఒక ఉద్యోగిగా మాత్రమే కాకుండా, పాఠశాల కుటుంబంలో ఒక సభ్యురాలిగా అందరితో మమేకమయ్యారు. విద్యార్థులతో ప్రేమగా మాట్లాడడం, వారికి సహాయం చేయడం, ఉపాధ్యాయులతో గౌరవంగా వ్యవహరించడం ఆమె ప్రత్యేక లక్షణాలు. ఆమె వినయపూర్వక స్వభావం అందరికీ ఆదర్శంగా నిలిచింది.అని పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు.34 సంవత్సరాల సుదీర్ఘ సేవ అనంతరం ఆమె పదవీ విరమణ చేసినా, ఆమె చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివి. ఆమె జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది – ఏ పని చిన్నది కాదు, మనం చేసే పని పట్ల నిబద్ధత, క్రమశిక్షణ ఉంటే అది గొప్పదే.అని గ్రామ సర్పంచ్ దండ ఆదర్శ్ అన్నారు.మణెమ్మ సేవలు పాఠశాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆమెలాంటి సేవామూర్తులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు,నర్సింహా రెడ్డి, ఖదీర్ పాషా, విజయ్ మోహన్ రాజ్,జయసుధ,అర్చన అమూల్య, శైలజ,నవనీత,, పద్మజ, ప్రశాంతి దేవి,రేణుకా దేవి, రాధిక ప్రియదర్శిని,చార్లెస్, వెంకటరెడ్డి, రాము, ధనరాజ్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు పై మాట్లాడే హక్కు ఎవరికి లేదు

- **బీఆర్ఎస్ సమన్వయంతో కో-ఆప్షన్ పదవుల భర్తీ**

**గుమ్మడిదల, ఏప్రిల్ 23( సిరి న్యూస్):**



కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేసే హక్కు ఎవరికి లేదని, బీఆర్ఎస్ హయంలోనే రాష్ట్ర ప్రజలకు సమగ్ర సంక్షేమ పాలన అందిందని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదలలోని సీజీఆర్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో 15 స్థానాల్లో గెలిచి బీఆర్ఎస్ పార్టీ చైర్మన్ పదవిని కైవసం చేసుకుందని తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నాలుగు కో–ఆప్షన్ సభ్యుల ఎంపికను ఎలాంటి విభేదాలు లేకుండా సమన్వయంతో ఏకగ్రీవంగా పూర్తి చేసినట్లు చెప్పారు. రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అతిపెద్ద నీటి ప్రాజెక్టుగా పేరుగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నాయకత్వంలో నిర్మించారని పేర్కొన్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం దీని ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రాజెక్టుపై పూర్తి అవగాహన లేకుండా విమర్శలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు సరైన పథకాలు అమలు కావడం లేదని విమర్శించారు. గుమ్మడిదల సర్వే నెంబర్ 109 పరిధిలోని రైతులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని, పూర్వీకుల కాలం నుంచి సాగు చేస్తున్న పేద రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తుచేస్తూ, విమర్శలు చేసే ముందు ఆలోచించాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గుమ్మడిదల నుంచి కానుకుంట గ్రామ శివారు వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.7 కోట్లకు పైగా నిధులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చొరవతో మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. వరుస ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయాలు సాధించడం పార్టీ బలం తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మురళి, కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, కిషన్ అనంతారం సర్పంచ్ శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి, మద్ది శేఖర్ రెడ్డి, తోల్చుక్క సత్యనారాయణ, దయానంద్, చాకలి ప్రకాష్, ఫయాజ్, అనంతారం మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**కో ఆప్షన్ సభ్యుల ఎంపిక ఏకగ్రీవం**

గుమ్మడిదల మున్సిపాలిటీకి ప్రకటించిన కోఆప్షన్ సభ్యుల పేర్లు టిఆర్ఎస్ పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గుమ్మడిదల నుంచి ఎండి ఫయాజుద్దీన్, అన్నారం నుంచి షేక్ నూర్జహాన్, బొంతపల్లి నుంచి సద్ది విజయభాస్కర్ రెడ్డి, దోమడుగు నుంచి వెంకట్రాం కలమ్మ ఎన్నికైనట్లు వెల్లడించారు.

# అంగరంగ వైభవంగా ప్రారంభమైన లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు





**కొండాపూర్ ఏప్రిల్ 23 (సిరి న్యూస్):**


మండల పరిధిలోని మారేపల్లిలో గురువారం శ్రీ లక్ష్మీ నారాయణుడి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామం అంతా హరినామ స్మరణ మారుమోగుతుంది. ఈ ఉత్సవాలలో భాగంగా ఉత్సవ మూర్తులను తీసుకువచ్చేందుకు ఉదయం 10 గంటల కు మారేపల్లి నుండి సంగారెడ్డి లోని వైకుంఠపురం వరకు రథంతో పాటు బస్సులో మహిళలు, ద్వి చక్రవాహనాలలో పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. వైకుంఠపురం ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించారు. . ఈ శోభాయాత్రలో భాగంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు సాంప్రదాయ దుస్తులను ధరించి కోలాటాలు వేయగా, పురుషులు ఉత్సాహంగా చెక్క భజన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఈ శోభాయాత్ర సంగారెడ్డి నుండి వయా పెద్దాపూర్. తొగర్‌పల్లి, కొండాపూర్ మీదుగా మారేపల్లికి చేరుకొంది. అత్యంత శైభవంగా జరుగుతున్న ఈ శోభాయాత్రలో భాగంగా తొగర్‌పల్లిలో ప్రతి ఇంటి నుండి ఒక కళాశాలన్ని తీసుకువచ్చి గ్రామస్థులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

# మెదడును పాడుచేసే అలవాట్లు ఇవే..!

మన అలవాట్లే మనల్ని కంట్రోల్ చేస్తాయి. మన ఆలోచనా తీరును, మన సామర్థ్యాన్ని కూడా. అదెలా అంటే వీటన్నింటికీ మూలాధారమైన మెదడుపై ప్రభావం చూపి. అవును మనకు ఉన్న ప్రతి అలవాటు కూడా మెదడుపై కొంత ప్రభావాన్ని చూపుతుంది. అది మంచి అలవాటైనా.. చెడ్డ అలవాటైనా. మనం పూర్తిగా ఆరోగ్యంగా ఉండాలంటే ముందు మన మెదడు ఆరోగ్యంగా ఉండాలి. అలా లేని పక్షంలో బయలకు మనం ఎంత దిట్టంగా కనిపించిన లోపల సమస్యలు కుంగదీస్తుంటాయి. మన శరీరంలో అన్ని అవయవాలు మెదడుపై ఆధారపడే పనిచేస్తాయి. మెదడు ఇచ్చిన సూచనల మేరకే అవయవాలు తమ పనిని చేస్తాయి. కానీ మనకు ఉండే కొన్ని అలవాట్లు మెదడును పాడు చేస్తాయని, తద్వారా మన పూర్తి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని అంటున్నారు నిపుణులు. మరి అలాంటి అలవాట్లు ఏంటో ఒకసారి చూద్దామా..

### రోజంతా కూర్చొని ఉండటం:

గంటల కొద్దీ టీవీలకు, మొబైల్ స్క్రీన్లకు ఎదురుగా కూర్చొని టైం వేస్ట్ చేయడం ఆపండి. ఇలా చేయడం వల్ల మీ మెమొరీశక్తి తగ్గిపోయే విధంగా మెదడులో మార్పులు చేస్తుంది. గంటకొకసారి స్వల్ప విరామం తీసుకుంటూ కాస్త దూరం నడిచేలా ప్లాన్ చేసుకోండి.



### ఎక్సర్‌సైజ్ చేయకపోవడం:

శారీరక శ్రమ తగ్గిపోవడం మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుందట. చాలా అధ్యయనాల్లో రుజువైన విషయమేమిటంటే, ఎక్సర్‌సైజ్ డైలీ చేసే వారిలో జ్ఞాపక శక్తి తగ్గిపోవడం తక్కువగా కనిపించిందట. అంతేకాకుండా, మెదడులోని జ్ఞాపక శక్తికి కారణమయ్యే హిప్పోక్యాంపస్ అనే భాగానికి సపోర్ట్ అందిస్తుంది. వయస్సు ఎక్కువైందనో, ఇతర కారణాలతో ఖాళీగా కూర్చోకుండా సింపుల్ యాక్టివిటీస్ చేస్తుండండి. వాకింగ్ లాంటి సింపుల్ వ్యాయామాలు చేస్తుండటం వల్ల కలిగే ఫలితాలు చూసి మీరే ఆశ్చర్యపోతారు.

### ఒత్తిడి తీసుకోవడం:

ప్రతి విషయానికి ఆలోచిస్తూ ఉంటే, న్యూరోటిజం వస్తుందని గుర్తించండి. ఇది మెదడు సైజును చిన్నగా చేయడంతో పాటు జ్ఞాపక శక్తిని తగ్గిస్తుంది. ఒత్తిడి నుంచి బయటపడేలా రిలాక్సేషన్ టెక్నిక్స్ పాటించండి. యోగా, ధ్యానం లాంటివి చేస్తుండండి.





### రక్తపోటును నిర్లక్ష్య చేయడం:

హైబీపీ అయినా లోబీపీ అయినా కచ్చితంగా మెదడుపై ప్రభావం చూపిస్తుంది. మెదడుకు రక్త సరఫరా అయ్యే వేగాన్ని తగ్గించేస్తుంది. ఫలితంగా మెదడులోని కణాల తీరు మారిపోతుంది. దీని కోసం రక్తపోటును అదుపులో అంటే 120/80 గా మెయింటైన్ చేయండి.

### ఫాస్ట్ ఫుడ్ తినడం, షుగరీ డ్రింక్స్ తాగడం:

మీరు తీసుకునే ఆహారంలో షుగర్ లేదా ఫ్యాట్ ఎక్కువ కాకుండా చూసుకోండి. ఈ అలవాట్లు గుండెకు మాత్రమే కాదు మెదడుకు కూడా అనారోగ్యాన్ని తెచ్చిపెడతాయి. వాటికి బదులుగా చేపలను, కూరగాయలను, ధాన్యంతో చేసిన ఆహారం తీసుకోవడం వల్ల బ్రెయిన్ హెల్త్ మెరుగవుతుంది.



### ఒంటరితనం:

ప్రశాంతత పేరుతో చాలా మంది ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. నిజానికి ఒంటరితనం జ్ఞాపక శక్తిని తగ్గించి మతిమరుపుకు కారణమవుతుంది. మీ ఆలోచనలకు తగ్గ వ్యక్తులతో కలిసి టైం స్పెండ్ చేయండి. ఒంటరిగా గడిపేవారికి వినడం ఇష్టం ఉండదు. అలా కాకుండా ఎదుటివారు చెప్పే మాటలు ఎక్కువగా వింటూ ఉండండి.

### నిద్ర గురించి పట్టించుకోకపోవడం:

నిద్రకు సరిగా సమయం కేటాయించకపోవడం వల్ల మీ ఫోకస్ తగ్గిపోతుంది. ఫలితంగా మానసిక సామర్థ్యం తగ్గిపోతుంది. కనీసం ప్రతి రోజూ రాత్రి ఏడు గంటల సేపు నిద్రపోవడం ముఖ్యమని తెలుసుకోండి.



### ఆడుకోవడానికి సమయం ఇవ్వకపోవడం:

ఆటలు మెదడుకు పని పెంచేలా చేస్తాయి. జ్ఞాపక శక్తిని మెరుగుపరుస్తాయి. సరదాగా ఉంచుతూనే మెదడు పనితీరును కాపాడతాయి. ఆటల కోసం సమయం ఇవ్వకపోవడం వల్ల మెదడు ఆరోగ్యం పెంపొందించుకునే అవకాశాన్ని కోల్పోతారు. దీని కోసం మీకున్న రకరకాల హాబీలను ఎంజాయ్ చేయండి. పుస్తకాలు చదవడం, పజిల్స్ పూర్తి చేయడం వంటివి కూడా మెదడును ఎంగేజ్ చేయడానికి ఉపయోగపడతాయి.





# పిల్లల ముందు పేరెంట్స్ చేయకూడని మూడు పనులు

పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడే తాపత్రయం అంతా ఇంతా కాదు. వారికి ఉజ్వల భవితను అనుక్షణం ఆలోచిస్తుంటారు. కానీ వాళ్లు పిల్లల ముందు చేసే కొన్ని పనులే పిల్లల జీవితాలను ప్రమాదంలో పడేస్తాయని నిపుణులు అంటున్నారు. ఈ మాట ఎవరో అంటుంది కాదు.. చాణుక్యుడు చెప్పిన మాట ఇది. చాణుక్యుడు చిన్నపెద్దా తేడా లేకుండా అందరికోసం ఎన్నో విలువైన న్యాయసూత్రాలు చెప్పాడు. అందులో భాగంగా జీవితాన్ని ఎలా గడపాలి చెప్పడంతో పాటు.. క్లిష్టపరిస్థితుల్లో కూడా ఎలా ప్రవర్తించాలి అన్నది వివరించారు. ఆయన పిల్లలను ఎలా పెంచాలి అన్న అంశాన్ని కూడా చెప్పారు. పిల్లల ముందు తల్లిదండ్రులు చేసే ఎలాంటి పనులు.. వారి భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి, ప్రమాదంలో పడేస్తాయి అన్న అంశాలను కూడా ఆయన చెప్పారు. తల్లిదండ్రుల నోటి నుంచి వచ్చే ప్రతిమాట పిల్లలపై ప్రభావం చూపుతుందని అందుకే పిల్లలు దగ్గర్లో ఉన్న సమయంలో ఆచితూచి మాట్లాడాలని చాణుక్యుడు అంటున్నాడు. పిల్లలు చిన్నప్పుడు వారి పరిసరాల్లో తల్లిదండ్రులు ఎలా ప్రవర్తిస్తారో.. పిల్లలు పెద్దయిన తర్వాత కూడా అదేలా ప్రవర్తిస్తారని ఛాణుక్యుడు అంటున్నారు. అందుకే పిల్లలు చుట్టుపక్కల ఉన్నప్పుడు తల్లిదండ్రులు చేయకూడని కొన్ని విషయాలను చాణుక్యుడు చెప్పాడు. అవేంటో తెలుసా..

పిల్లల ముందు కించపరిచే పదాలు, దూషనలు చేయకూడదు. చెడు పదాలను తప్పిదాలి కూడా మాట్లాడకూడదు. వారి ముందు చెడు పదాలు, నోరుజారి మాట్లాడటం చేస్తే వారు భవిష్యత్తులో అదే నేర్చుకుంటారు. అవి మరింత సమస్యలకు దారితీస్తుంది. పిల్లలను నాగరికులుగా తమ బాధ్యతను గుర్తించి తదనుగుణంగా నడుచుకోవాలి. పిల్లల ముందు చాలా మర్యాదగా ఉంటే.. వారు కూడా అదే నేర్చుకుంటారని, పెరిగే కొద్దీ వారు కూడా మర్యాదగా ప్రవర్తించడం నేర్చుకుంటారు.

పిల్లల ముందు ఒట్లు వేయడం, ప్రమాణాలు చేయడం చేయకూడదు. ఏ తల్లిదండ్రీ కూడా తమ పిల్లల ముందు ఈ తప్పు ఎట్టిపరిస్థితుల్లో చేయకూడదు. ఇది పిల్లల మనస్సులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లల ముందు మాట్లాడేటప్పుడు గౌరవంతో మాట్లాడాలి. ఇతరుల గురించి కూడా మంచే మాట్లాడాలి.



పిల్లల ముందు అబద్ధాలు కూడా ఆడకూడదు. వారి ముందే అబద్ధాలు చెప్తే.. అబద్ధాలు చెప్పడం తప్పు కాదన్న భావన వారిలో పెరుగుతుంది. మీ అబద్ధాలలో పిల్లలను కూడా కలిపితే వారిలో మీపై గౌరవం, నమ్మకాన్ని కోల్పోతారని చాణుక్యుడు చెప్తున్నాడు. వీళ్లు మీకు కూడా అబద్ధాలు చెప్పడం ప్రారంభించే అవకాశం ఉందని, అందుకే పిల్లల ముందు అబద్ధాలు చెప్పకపోవడమే మంచిదని చాణుక్యుడు అంటున్నాడు.

తల్లితండ్రులు తమ పిల్లల ముందు గొడవ పడడం, ఇతరుల తప్పుల గురించి గట్టిగా మాట్లాడడం వంటివి చేస్తుంటారు. ఇది చాలా పెద్ద తప్పు అని చాణక్యుడు చెప్పాడు. ఇలా చేయడం వల్ల పిల్లలకు తల్లిదండ్రుల పట్ల గౌరవం పోతుంది. అందువల్ల, పిల్లలు మిమ్మల్ని అవమానించడానికి, చెడుగా చిత్రీకరించడానికి వెనుకాడరు. అందుకే ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని చాణక్యుడు చెబుతున్నాడు.



Published by Badhe Jayasree on behalf of Siri Media. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : 9697889922. E-Mail : siridailynews@gmail.com.